
■ అవసరాల రామకృష్ణారావు
■ చిత్రాలు: మోతుకూరి రమేష్

వాచీ చూసుకున్నాడు బ్రహ్మం. అది ఆగిపోయి ఉంది! గొప్ప చికాకనిపించింది అతనికి. సమయానికి ఏదీ కలసి రాకపోవడం అతని జాతకంలోనే ఉందేమో! చివరిదాకా ఆశ కల్పిస్తాయి. చెప్పాపెట్టకుండా హఠాత్తుగా ఆగి ఊరుకుంటాయి.

ఓ వంతు ఆస్తి తగలేసి తాను ఆడిన రేసు గుర్రాలూ అంతే.

క్రూరమైన పట్టుదలతో అతని నుదుట మడత



ఏర్పడింది. ఓటమి అనేది ఒప్పుకోడం అతనిలాంటి వాళ్ళ కూటమిలో లేనిది. ఎలాగో అలా సాధించే ప్రయత్నాలు చేయడం వాళ్ళకి అలవాటే. పుచ్చుకుంటున్న లంచం బయటపడి ఉద్యోగం ఊడినా, ఇరవై ఏడేళ్ళ కూతురికి ఇంకా పెళ్ళవకపోయినా రోజుకింకా అరపెట్టె సిగరెట్లు ఊదేస్తున్నాడంటే అదెలాంటి ధైర్యంతో!

వాచీ చెవి నులుపుతూ ఎదుటి పెద్ద హాల్లో అంతెత్తున ఉన్న గడియారం వైపు చూశాడు బ్రహ్మం. ఆరున్నర చూపిస్తోంది.

అభిషేక్. స్టేట్ బ్యాంక్‌లో క్యాషియర్ ఉద్యోగం వెలగబెడుతున్నాడు. వాళ్ళిద్దరికీ ఉమ్మడి ఆస్తిగా పెంకుటిల్లొకటి మిగిల్తే దాని అమ్మకాని కోసం ప్రత్యేకించి బ్రహ్మం ఆ ఊరొచ్చాడు.

వారం రోజులు మకాం వేసి బేరగాళ్ళని కిందా మీదా పెడితే లక్ష రూపాయలకి బేరం కుదిరింది. మర్నాడే రిజిస్ట్రేషను.

రాకేం చేస్తాడు. డబ్బంటే ఎవడికైనా చేదా! కష్టమంతా తనది. నగానికి నగం గెద్ద తన్నుకు పోయినట్టు తన్నుకుపోయే అదృష్టం వాడిది. నెలనెలా పదివేలు అందుకునే బ్రహ్మచారి జల్సా వాడిది. పది వేళ్ళా నోట్లోకి ఏ పూటకి ఆ పూట ఎలా వెడతాయా అనుకునే దివాలా బతుకు తనది.

అంతేకాదు, వచ్చిందైనా స్వేచ్ఛగా ఖర్చుపెట్టుకో నివ్వకుండా తెగించి తనమటుకు తానే ఓ సంబంధాన్ని కుదుర్చుకుని 'వచ్చిందాంట్లో ఏ పదివేలో నువ్వు ఉంచేసుకుని మిగిలిందాంతో కట్నమిచ్చి నన్ను సాగనంపు. మళ్ళీ ఏ బ్రాకెట్లోనో పెట్టేశావో నిన్ను నానా అల్లరీ పెట్టేస్తాను' అని హెచ్చరించిన కూతురు వెంకటమ్మ ఒకర్తి!

ఏదీ తల్చుకున్నా ఒళ్ళు మండిపోజొచ్చింది బ్రహ్మానికి. తన కళ్ళ ముందు పెరిగి రోజూ ఇంత కాచి పోస్తున్న కన్న కూతురికి ద్రోహం చెయ్యడం

పడనీ ఎలాగో ఓలాగ. ఏదో ఓ కాడికి మస్కా కొడదాం' అనుకుంటుండగా బస్సు ఆగనే ఆగింది.

అన్ని మైళ్ళు ప్రయాణం చేసి వచ్చాడా, అప్పుడే బీరువాలోంచి తీసిన ఇస్త్రీ మడతలా అభిషేక్ ఆడే దిగడం, "మన్నించు చిన్నాన్నా. ముందుగా రాలేకపోయాను" అనుకుంటూ.

పెదవుల మీది ఆ 'పంచదార పాలిష్' మాత్రం బ్రహ్మం భరించలేకపోయాడు. ఒక్క దులుపు దులపకుండా మాత్రం ఉండలేకపోయాడు.

ముప్పై ఏళ్ళయినా రాకుండా పటిష్ఠమైన ఆర్థిక పరిపక్వతని చేరిన అభిషేక్‌ని చూస్తే అరవై అయిదేళ్ళు దాటి అల్లల్లాడుతున్న బ్రహ్మం దైన్య స్థితి ఊరుకోలేకపోయింది.

కడిగేశాడు, దులిపేశాడు. నిప్పులు చెరిగేశాడు.

కార్యవాది అయిన తననే కల్లోలపరచి బయట పడిపోయినట్టు చేశాడుగానీ వాడు చెక్కు చెదరడే!

"పెద్దవాడివి. నీకు శ్రమ ఇచ్చినట్టున్నాను. సారీ. పద మంచి లస్సీ తాగుదాం. అన్నట్టు చెప్పడం మరచిపోయాను. నా చేతో చేత్తో ఈ బ్రీఫ్‌కేసులు చూశావ్ కదా! ఒకటి నాకోసం. ఇలాంటిది చూసి వెంకటక్క ముచ్చటపడితే దానికోసం ఇలాంటిదే మరొకటి కొన్నాను. ఇదిగో పట్టుకో. వెళ్ళేక ఇచ్చే ద్దువుగాని. అన్నట్టు దాని పెళ్ళి నిశ్చయమైందిటగా

ఒకే. నిన్ను ఊరికే పోనీన్నా' అని నిశ్చయించుకున్నాడు బ్రహ్మం.

ఆటో రిక్షా హోటల్ ముందు ఆగేవరకూ వాళ్ళిద్దరి మధ్యా మరేం మాటలు దొర్లలేదు.

రూమ్ చేరీ చేరగానే స్నానం చేసి ఒళ్ళంతా పౌడరు పట్టించి, శరీరం మూల మూలలా సెంటు ఇంకిస్తున్న ఆ 'ఘుమఘుమల రతిరాజు'ని చూస్తుంటే బ్రహ్మం మరింతగా 'ధుమధుమల యతిరాజు'గా మారి పోయాడు. ఈసారి మాత్రం అతి కష్టంమీద తిట్లకి లంకించుకోకుండా ఆగిపోయాడు.

"మరేం లేదు చిన్నాన్నా. బస్సు ప్రయాణంలో అనాటి క్లాసుమేటు మనోరంజని కలిసింది. ఇప్పుడు వాళ్ళిక్కడే ఉంటున్నారట. దిగుతూనే ఒట్టేయించుకుంది పిఠాపురం చినపాప సినిమా సెకండ్ షోకి తప్పకుండా నన్ను రమ్మని. అదయాక హోటల్ 'డే డ్రీమ్'లో మా డిన్నరు. ఏదో పడుచువాళ్ళం కదా చిన్నాన్నా, అనేకం ఉంటాయ్. కోడి కూయక ముందే వచ్చేస్తాలే. కంగారు పడకు. వేరే డూప్లికేట్ కీ నాదగ్గరుందిగా. బాగా అలసిపోతాను కదా రాగానే పక్క ఎక్కేస్తాను. రిజిస్ట్రీ వేళకి బాగా ముందుగానే నన్ను లేపు సుమీ. గట్టిగా కుదిపితే గాని నాకు మెలకువ రాదు. గుర్తుంచుకుంటావ్ కదూ" అంటూ విజిలేసుకుంటూ మెట్లు దిగిపోయాడు అభిషేక్.

మర్నాడు రాత్రి ఎనిమిదీ ఎనిమిదిన్నర సమయానికి బ్రహ్మం, అభిషేక్ రైల్లో తిరుగు ప్రయాణంలో ఉన్నారు. ఒకే కంపార్ట్‌మెంటులో అయినా కాస్త దూరంగా అభిషేక్‌కి పై బెర్తూ, బ్రహ్మానికి కింది బెర్తూ దొరికేయి.

తల కింద బ్రీఫ్‌కేస్ పెట్టుకుని అభిషేక్ ఏనాడో గుర్రెట్టేసినట్టున్నాడు.

నిద్ర పట్టని బ్రహ్మానికి మాత్రం వల్లమాలిన గుర్రుగా ఉంది. ఆ రిజిస్ట్రేషన్ నాడు ఏ ఒక్కటీ తాను అనుకున్నట్టు జరగలేదు. ఇల్లు కొనుక్కున్న పెద్దమనిషి తన దురదృష్టం కొద్దీ అభిషేక్‌కి బాగా తెలిసినవాళ్ళ దూరపు చుట్టం అయ్యాడు.

న్యాయానికి అధి దేవత తానే అనుకున్నాడో ఏమో చెరో యాభైవేలూ గంటలకొద్దీ లెక్క పెట్టి, చెరో కవర్లోనూ పెట్టి పదే పదే 'ఎవరి డబ్బు వారికి ముట్టింది కదా' అనిపించాడు.

అక్కడ ఆఫీసులోనూ, ఇక్కడ బయటా ఈ వ్యవహారమంతా పూర్తయ్యేసరికి మూడు దాటింది. అయినా ఆ చాదస్తపు ముండా కొడుకు అవీ ఇవీ జాగ్రత్తలు చెబుతూ చీకటి పడేదాకా వదల్తే!

బ్రహ్మం తలపెట్టిన ఎలాంటి లాలూచీకీ అవకాశమే లేకపోయింది. 'నేను పడ్డ శ్రమకీ, ఖర్చుపెట్టిన సొమ్ముకీ ఇదిగో ఇంత కక్కు' అని అభిషేక్‌గాణ్ణి డైరెక్ట్‌గా అడుగుదామని బ్రహ్మం అనుకున్నదీ లేదు, దానికి అవకాశం చిక్కిందీ లేదు.

అన్నిట్నీ మించి బ్యాంకులో కట్టి చెక్కు తీసుకుందామంటే వేళ మించిపోయి అదీ కుదిరింది కాదు. చెరో యాభై వేలూ తలో బ్రీఫ్‌కేస్‌లోనూ పట్టుకుని రాత్రి వేళ రైలెక్కవలసీ వచ్చింది. ఇంతకీ పై షోకు తప్ప ఆ బ్రీఫ్‌కేస్‌లలో ఉన్న సేఫ్టీ ఏపాత్రమని. ఎలాగా బ్యాంకులో కట్టేద్దాం కదా అని ఓ పెద్ద బట్టల సంచి తప్ప తాను మరేం పట్టుకోలేదు. ఇప్పుడు తన ఆయువుపట్టంతా ఈ చిన్న బ్రీఫ్‌కేస్‌తో ముడిపడి ఉంది.

దాన్ని మరింత దగ్గరికి లాక్కుంటూ కూర్చున్నాడు బ్రహ్మం.

పోనీ తెల్లగా తెల్లారే దాకానైనా ఆ అభిషేక్‌గాడు తనతో ఉంటాడా! ఏ మూడున్నరకో వాడు పని చేస్తున్న బ్యాంకు ఉన్న ఊరొస్తుందిట. ఏదో ఇన్‌స్పెక్షన్ ఉందట. దిగిపోయి తీరాలట. ఇదీ వీడి బోడి సాయం.

టైమ్ పన్నెండు దాటిందని వాచీ చెప్తోంది. 'మేమంతా పడుకున్నామని' పేసెంజర్ల సామూహిక నిశ్శబ్దం తెలియజేస్తోంది. నేను మాత్రం మేలుకునే ఉన్నానని డిమ్‌గా వెలుగుతున్న నీలం బల్బు చెబుతోంది.

కునకడానికైనా నోచుకోని బ్రహ్మం ఒక్కసారి తలెత్తి అభిషేక్ పడుకున్న బెర్త్ వైపు చూసి గుతుక్కుమన్నాడు. అతనక్కడ లేడు. బ్రీఫ్‌కేస్ మాత్రం ఉంది. ఎంత అశ్రద్ధ!

'పోనిద్దూ చిన్నాన్నా! కట్టుకున్న పెళ్ళామైనా, కట్టలు కట్టలు డబ్బైనా ప్రాప్తముంటే ఉంటుంది. లేకపోతే కళ్ళ ముందే లేచి చక్కా పోతుంది. ఏ పుట్టలో ఏ పాముందో! ఏ పెట్టెలో ఎంత సొమ్ముందో ఎవడు చూశాడు. గొలుసులు బిగించి కట్టడం మాట దేవుడెరుగు ఈ బ్రీఫ్‌కేస్‌లకు నేను తాళాలైనా వెయ్యను. ఇలా ప్రెస్ చేస్తే అలా బుస్ అని పడగలా పై భాగం లేవకపోతే నాకు కుదరదు సుమీ!'

'వెధవగారు' ఏ కారుకూతలైనా కూస్తారు. ఇలాంటి వాడి నోరు మూయించడానికి ఇదే తగిన సమయం.

బ్రహ్మం కొట్టుకుంటున్న గుండెల్తో లేచి అటూ ఇటూ చూశాడు.


నెమ్మదిగా పైకెక్కి చూశాడు. అభిషేక్‌గాడు అప్పుడే లెట్రిన్‌లోకి వెళ్ళడం గమనించాడు. ఇక ఆలస్యం చేయలేదు.


అతని బ్రీఫ్‌కేస్ కిందకి దించాడు. అన్నీ అయిదొందల రూపాయల కట్టలే గనుక అందులోనీ రొక్కం తీసేసినా, ఇంకోదాన్లో వేసినా పెట్టె బరువులో పెద్దగా తేడా గమనించేలా లేదు. వణుకుతున్న చేతుల్తో అభిషేక్ బ్రీఫ్‌కేస్‌లోని నోట్ల కట్టలన్నీ తన బ్రీఫ్‌కేస్‌లోకి మార్చేశాడు. ఆ ఖాళీ పెట్టెని యథా స్థానంలో ఉంచి తన బెర్త్ మీదకి వచ్చేశాడు ఏమీ ఎరగనట్టు.

తాను పొరపాటు పడ్డాడు గానీ, వెక్కిరగా మార్చుకోకపోవడం వల్ల తనకెంత లాభం చేకూరింది! మళ్ళీ వచ్చి పడుకున్నాడే గానీ బ్రీఫ్‌కేస్‌లో ఏముందో తెరిచైనా చూసుకోడే. మరీ ఇంత నిర్లక్ష్యమా! ఏమైనా అంటే వేదాంతంతో కూడిన మిడిసిపాటు కబుర్లా!

ఇలాంటి వెధవల పట్ల, ఎంతటి రక్తసంబంధీకులు గానీ ఇదే న్యాయం. ఏ అపరాత్రి వేళో వాడి స్టేషన్ వచ్చి ఆదరా బాదరా రైలు దిగిపోయి ఇల్లు చేరుకుని, బ్రీఫ్‌కేస్ తెరుచుకుని లబోదిబోమననీ. అంత కేర్‌లెస్‌గా ఉన్నందుకు ఆ శిక్ష అనుభవించవలసిందే. ఎలా పోయిందో, ఎవడు తీశాడో- రుజువా, సాక్ష్యమా!

'నేను పడ్డ శ్రమకీ, ఖర్చుపెట్టిన సొమ్ముకీ ఇదిగో ఇంత కక్కు' అని అభిషేక్‌గాణ్ణి డైరెక్ట్‌గా అడుగుదామని బ్రహ్మం అనుకున్నదీ లేదు, దానికి అవకాశం చిక్కిందీ లేదు.





విజయం చేకూర్చిన సంతృప్తితో ఎంత ఆపుకుందామనుకున్నా బ్రహ్మానికి చిన్న కునుకు పట్టక తప్పింది కాదు. ఆ కునుకే మాంచి నిద్రగా మారగలదని తెల్లగా తెల్లారేక తన ఊరి స్టేషన్ వచ్చేదాకా బ్రహ్మం గుర్తించలేకపోయాడు. కంగారుగా లేచి బ్రీఫ్‌కేసూ, బట్టల సంచీ పట్టుకు దిగిపోయాడు. ఇంటికి చేరుకుని అది తెరిచి చూశాక దాన్తో పాటు తెరుచుకున్న బ్రహ్మం నోరు కూడా చాలా సేపు అలాగే ఉండిపోయింది. అది పూర్తిగా ఖాళీ. లోపలి గుడ్డ సొరుగులో మడత పెట్టిన ఓ కాగితం ముక్క మాత్రం ఊడిపడింది. అది అభిషేక్ రాసిన ఉత్తరం. అందులో ఇలా ఉంది:

డియర్ చిన్నాన్నా,

ఇలా నిన్ను అల్లరి పెడుతున్నందుకు, చెప్పకేం, నాకు మాత్రం విచారంగా లేదు. ఎటొచ్చీ కదులుతున్న రైల్లో ఇంత ఉత్తరం రాయడం ఇబ్బందిగానే ఉంది. చేసిన పని మంచిదని తోస్తే చిన్న చిన్న చికాకులు ఏపాటివిలే. అదీగాక ఏదో క్రాసింగ్ దగ్గర రైలు చాలా సేపే ఆగింది. అప్పుడు మూడొంతులు పూర్తి చేశానిది.

మా అమ్మానాన్నా చాలా చిన్నప్పుడే పోయారు. దయామయుడైన ఓ దూరపు బంధువు ఇంటిలో చేరి చదువుకుని నా కాళ్ళ మీద నిలబడి ఇంతవాణ్ణయాను. ఇన్నేళ్ళు గడిచినా ఏనాడూ నువ్వు నన్ను ఆదరించింది లేదు. ఒక్క రోజు ఇంటికి పిలిచి ఓ పూటైనా గుప్పెడు అన్నం పెట్టి ఎలా ఉన్నావని అడిగింది లేదు. ఇక రక్తసంబంధీకులమైన మన మధ్య మిగిలింది వెంకటక్క కాక మన ఉమ్మడి ఆస్తి పెంకుటిల్లు మాత్రమే. ఇక ఇన్నేళ్ళ పాటు ఆ ఇంటి బాధ్యత అంతా నువ్వే వహించావనీ, కేవలం నా వాటా నేను దండుకుపోవడానికే నేను వచ్చాననీ వచ్చీ రాగానే నువ్వు అనరాని మాటలనడం నాకు చాలా బాధ కలిగించింది. ఇన్నేళ్ళ పాటూ ఆ ఇంటి అద్దె అంతా నువ్వొక్కడివే అనుభవిస్తున్నావని నేనిక్కడ అనడం బాగుండదు కానీ, అది కటిక నిజం. పోనీ వన్నులూ మరమ్మతులూ పోను అంత ఇంటికీ నా వాటా అద్దె నెలకి ఓ యాభై అయినా మిగలలేదంటావా! ఎక్కడో ఒంటరిగా నా బాధలు నేను పడ్డాను గానీ, ఇన్నేళ్ళయినా ఒక్క రూపాయి నా వాటా పంపించి ఎరుగుదువా? నేను మేజర్ అయాకైనా నేనడిగానా ఏనాడైనా? నీ మటుకు నువ్వు పంపించావా!

ఇవన్నీ అతి సహజంగా తీసుకుని, వ్యసనాలకి లోనై ఆస్తి పాడు చేసుకున్న నువ్వు కష్టపడి పైకొచ్చిన నన్ను గుమ్మంలోంచే దుమ్మెత్తిపోయడం ఎలాంటి పెద్దరికం?

చేసిన దగుల్బాజీ పనులన్నీ చల్లగా చేసేసి ఆ కాలపు వాళ్ళంతా అతి నీతికోవిద ఎనీ, మా కాలపు వాళ్ళంతా బొత్తిగా పనికిమాలిన వాళ్ళనీ నువ్వు కడిగిపారేస్తుంటే నిన్నింకా ఏడిపించాలనిపించింది. క్లాసుమేటుతో గడపడం అవీ అన్నీ కల్పితాలు. నేను వెళ్ళొచ్చింది సెకండ్ షో సినిమాకి మాత్రమే.

ఇక సొమ్ము చేతిలో పడ్డ దగ్గర్నుంచీ నువ్వు చెప్పిన జాగ్రత్తలూ, చేసిన పదే పదే హెచ్చరికలూ విని విని నాకు వినుగెత్తిపోయింది. మా బ్యాంక్ వాళ్ళ లావాదేవీలన్నీ లక్ష్మీదేవితోనే కదా! రెండేళ్ళ క్యాషియర్‌గా పనిచేస్తున్న నన్నే ఓ వ్యర్థుడిగా, అసమర్థుడిగా నువ్వు అనుమానించి పారేస్తుంటే ఎలా . ఊరుకోమన్నావ్ చిన్నాన్నా? తక్కిన ఉద్యోగస్థుల మాట నాకు తెలీదు గానీ, మా బ్యాంక్ ఉద్యోగస్థులం ఎవరనుకున్నావ్, అక్షరాలా 'అర్థనారీశ్వరులం' సుమా!

నీ చేష్టలన్నీ లెట్రిన్ పక్క నీడలో నిలబడి గమనిస్తూనే ఉన్నాను. ఇరవై ఏళ్ళ పై మాటగా నా ఇంటి వాటా నా వంతు అద్దె అనుభవించిందే చాలక ఎంతటి దురాగతానికి పాల్పడ్డావ్ చిన్నాన్నా! ఆస్తి అంతా కాజేద్దామనుకునే నీ దుర్బుద్ధికి తగిన శాస్తి చేయకుండా ఎలా ఉండమన్నావ్? నాకు రావలసిన నోట్ల కట్టలు చల్లగా నీ నోట కుక్కుకుందామని ప్లాన్ వేశావే, మన్ను కొట్టకుండా ఎలా ఊరుకోమన్నావ్?

ఏ పద్దూ లెక్కా లేదు కదా అని, నేనిదంతా చూడలేదేమో అనుకుని చేసిందేదో చేసి చల్లగా నిద్రలోకి జారుకున్నావు. విజయం నీదే అనుకుని కలలు కన్నావు. పెద్దలు మీరంత శ్రమపడి దారి చూపిస్తే పిల్లలం మీ దారి పట్టకుండా ఉండగలమా! నీ అడుగుజాడల్లోనే నడిచీ గుట్టు చప్పుడు కాకుండా బ్రీఫ్‌కేస్‌లు తారుమారు చేశాను. ఇప్పుడు పూర్తి సరుకు భద్రంగా మా ఇల్లు చేరుతోంది. నువ్విప్పుడు ఎవరికెలాంటి ఫిర్యాదు ఇచ్చినా ఋజువూ, సాక్ష్యమూ లేదు గనుక ఎలాంటి లాభమూ ఉండదు.

అయితే, ఋజువూ సాక్ష్యమూ అక్కర్లేని గొప్ప న్యాయం ఒకటి లోకంలో ఉంది. అదే మానవతా ధర్మం. అది ఎవరి ప్రమేయమూ, ప్రబోధమూ లేకుండా ఎవరికి వారు తీసుకోవలసిన నిర్ణయం. దాన్ని అనుసరించే ఈ కింది నిర్ణయాలు తీసుకుంటున్నాను:

ఇదంతా మంచికే జరిగిందని నేననుకుంటున్నాను. ఎందుకంటే, వెంకటక్క ఈ మధ్య నాకు రాసిన ఉత్తరాన్ని బట్టి నువ్వేం పాత పద్ధతులు మార్చుకున్న ఋజువులేం లేవు. చేతికి చిక్కిన రొక్కంలో ముఖ్య భాగం నువ్వు వెంకటక్క పెళ్ళికి ఖర్చు పెడతావని మాకేం నమ్మకం కలగడం లేదు. వేరే యాభై వేలకి డిమాండ్ డ్రాఫ్ట్ వెంకటక్క పేరున అతి తొందరలో పంపుతున్నాను. అందులో నలభై వేలు నువ్వు ఇల్లమ్మిన వాటాలో నీ కూతురికి పెళ్ళికిచ్చిన డబ్బు అనుకుందాం. మిగిలిన పదివేలూ నేను మా అక్కకి ఇచ్చే పెళ్ళి కానుక.

ఇక వేరే పది వేలు నీ పేర్న డీడీ పంపుతున్నాను. అది నీ సొమ్మే. దాన్ని మినహాయింపుగా నీకు పైన వేసే ఉద్దేశం నాకు లేదు. ఈ ఉత్తరాన్ని మించిన పైను కూడా నీకు ఉండబోదు.

ఆఖర్న ఒక్క మాట చిన్నాన్నా! నాలాంటి కుర్రాళ్ళంతా బొత్తిగా చేతకాని వాళ్ళని నీలాంటి పెద్దలు అనుకోవడం మంచిది కాదు. గుర్తుంచుకుంటావ్ కదూ!

– అభిషేక్ ■

**ఆ కునుకే మాంచి నిద్రగా మారగలదని తెల్లగా తెల్లారిన తరవాత తన ఊరి స్టేషన్ వచ్చేదాకా బ్రహ్మం ఏమాత్రం గుర్తించలేకపోయాడు.**